సాక్షి
తిరుపతి

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



ముగిసిన హ్యాకథాన్..
తిరుపతి ఐఐటీలో జరుగుతున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే పోటీలు గురువారం ముగిశాయి - 8లో



జల దిగ్బంధం
బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తిరుపతి జిల్లా జలదిగ్బంధం అయ్యింది. - 8లో



రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి
పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. - 8లో

న్యూస్‌రీల్

పరవళ్లు తొక్కుతున్న తలకోన జలపాతం



తలకోన జలపాతంలో దుముకుతున్న నీరు

భాకరాపేట: అల్పపీడనం ప్రభావంతో ఎర్రావారిపాళెం మండలంలోని తలకోన జలపాతం పరవళ్లుతొక్కుతోంది. గురువారం ఉదయం నుంచి తలకోన జలపాతంలో భారీగా వరద ప్రవాహం వస్తుండడంతో తలకోనకు వెళ్లే మార్గం వద్ద ఉన్న కలుజు దాటకుండా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు తలకోన జలపాతం మార్గం మూసివేశారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి అర్బన్: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, కళాశాలలకు సెలవు ఇస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శుభం బన్సల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించారు. ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆ ప్రకటనలో ఆదేశించారు.

పటిష్ట భద్రతా చర్యలు

- అత్యవసర పరిస్థితుల్లో 112, 80999 99977 నంబర్లుకు సమాచారం

తిరుపతి క్రైం: జిల్లా వ్యాప్తంగా గురువారం కురుస్తున్న భారీ వర్షాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. డ్యామ్‌లు, వంకలు, వాగులు, చెరువుల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రమాదపు హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నామన్నారు. వంకలు, వాగులు, వద్ద ముంపు గురైన ప్రాంతాల్లో పోలీసులు పహారా పహారా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తాజా సమాచారం తెలుసుకుని అవసరమైనప్పుడే ప్రయాణం చేయాలని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్ 112, 80999 99977 నంబర్లకు సమాచారం ఇస్తే పోలీసులు తక్షణ సహాయక చర్యలు అందిస్తారని ప్రజలకు సూచించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,887 మంది స్వామి వారిని దర్శించుకోగా 25,725 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.88 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను ముందుగా క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

స్టార్టప్‌లతో అవకాశాలు అందిపుచ్చుకోవాలి



అతిథులను సత్కరిస్తున్న వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్స్, సెరికల్చర్, డీబీటీ బిల్డర్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో లైవ్ అగ్రి టెక్నాలజీ–స్టార్టప్ అవకాశాలు అనే అంశంపై జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ప్రొఫెసర్ డీఎం మమత ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాపునకు సిట్రస్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ ఇన్వేస్టిగేటర్ డాక్టర్ సి.మధుమతి ముఖ్య అతిథిగా హాజరై స్టార్టప్ ఫండింగ్ ఏజెన్సీలు, వ్యవస్థాపక అవకాశాలు, ఉద్యానవన రంగంలో సమీకృత వ్యవసాయ నమూనాలపై పలు సూచనలు చేశారు. అనంతరం నంద్యాలకు చెందిన వ్యవసాయ పారిశ్రామికవేత్త రమేష్ తేనెటీగల పెంపకం ద్వారా వివిధ స్టార్టప్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాపులో ప్రొఫెసర్లు సుజాతమ్మ, సావిత్రి, విజయ కుమారి, సువర్ణలత, శాంతి, శోభారాణి, హేమావతి, హరిప్రియ, రేఖ, మహిళా శాస్త్రవేత్త శ్వేత కుమారి, రీసెర్చ్ స్కాలర్లు, వివిధ విభాగాల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

‘చంద్రబాబుకు భేతాళుడి శాపం ఉంది. నిజం చెబితే ఆయన తల వేయి ముక్కలవుతుంది. అందుకే ఆయన నిజం చెప్పరు.’ అని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీ సాక్షిగా గతంలో అన్నమాటలు అక్షర సత్యమని పదే పదే రుజువు చేస్తున్నారు చంద్రబాబు. సూపర్ సిక్స్ అంటూ జనాన్ని వంచించి, గద్దెనెక్కి ఆరునెలలు అవుతున్నా బాబు ఆ హామీల ఊసెత్తడం లేదు. మాటల గారడితో నారా వారు మరోసారి మోసం చేశారని ప్రజలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. వారికి అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం అన్నదాతలకు అండగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తోంది.

ఇదేం చంద్రం.. హామీలు మాయం



ప్రజలకు వెన్నుదన్నుగా వైఎస్సార్ సీపీ

- మరోసారి కర్షకులను మోసగించిన కూటమి ప్రభుత్వం
- ఆరు నెలలూ సొంత ప్రచారాలకే పరిమితం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా..
- అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ
- నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

తిరుపతి సిటీ/తిరుపతి అర్బన్: ఎన్నికల వేళ రైతన్నకు అండగా ఉంటామని కూటమి నేతలు తియ్యటి మాటలతో నమ్మబలికారు. అవన్నీ ఉత్తిత్తివేనని ఆరు నెలల్లోనే తేలిపోయింది. అందరికీ అన్నం పెట్టే అన్నదాత ఫెంగల్ తుపాను ధాటికి విలవిల్లాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మరికొన్ని చోట్ల కోతకొచ్చిన పంటలు చేతికి దక్కకపోవడంతో దిక్కులు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా ఠంఛన్‌గా అందే పెట్టుబడి సాయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందజేయలేకపోయింది. అయినప్పటికీ రైతులు అప్పులు చేసి మరీ పంటల సాగుకు ప్రయత్నించారు. చివరికి ఆ పంటలు వర్షాలకు నష్టపోయిన రైతుకు ఆవేదనను మిగిల్చాయి. విపత్తుల వేళ అండగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండడంతో కర్షకులు కన్నీరు పెడుతున్నారు. గత ప్రభుత్వం వలే పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుకున్నా స్పందన లేకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ నెల 13న జిల్లాలోని అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో భాగస్వాములయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు. నేడు వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఆధ్వర్యంలో ఉదయం అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

ఆరు నెలల్లో నష్టం కలిగిందిలా..
గత ఏడాది లో జూన్ నెల నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలకు కోట్లాది రూపాయల లబ్ధిని చేకూర్చింది.అయితే ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత ఆరు నెలలు సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడం వల్ల జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు కలిగిన నష్టం ఇలా..

నేడు కలెక్టరేట్ ఎదుట ‘రైతన్న పక్షం’ మహా ధర్నా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా నిలిచేందుకు తిరుపతి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ‘రైత న్న పక్షం–చలో తిరుపతి’ పేరుతో మహా ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిప త్రం సమర్పించనున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న మహా ధర్నాకు మాజీ మంత్రి ఆర్కేరోజా, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, మాజీ ఎ మ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గ స మన్వయకర్తలు భూమన అభినయ్, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్, తి రుపతి మేయర్ శిరీష, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నేతలు, ఎంపీపీలు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ రైతు సంఘాల నేతలు హాజరుకానున్నారు.

ఆరు నెలల పాలన.. అధ్వానం

తిరుపతిజిల్లాను కూటమి నేతలు హామీల వరదలో ముంచెత్తారు. టీడీపీ కూటమి తీరా పాలనా పగ్గాలు చేపట్టి ఆరు నెలలు గడిచినా హామీల ఊసే ఎత్తడం లేదు. సంక్షేమానికి తూట్లు పొడుస్తూ హామీలను గాలికొదిలేసి, పాలన సాగిస్తోంది. గతేడాది ఇదేకాల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా లక్షల మంది పేదలకు రూ.1,835.51 కోట్ల లబ్ధిని చేకూర్చారు నాటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 12వ తేదీన కూటమి కొలువుదీరింది. గురువారంతో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయ్యింది. సూపర్ సిక్స్‌ను ప్రచారాస్త్రంగా చేసుకున్న చంద్రబాబు ఇప్పుడు వాటి ఊసెత్తడానికి భయమేస్తోందంటూ చేతులెత్తేశారు. పింఛన్ సాయాన్ని రూ.వెయ్యికి పెంచి కొత్తవి మంజూరు చేసే విషయమై నోరు మెదపడం లేదు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కదానితో సరిపెట్టారు. ఆ ఒక్క సిలిండర్ సబ్సిడీ సైతం అందలేదని జిల్లాలో చాలా చోట్ల ప్రజలు వెల్లడిస్తున్నారు. సూపర్ సిక్స్‌లో ప్రధానమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రస్తావననే ఎత్తడం లేదు చంద్రబాబు.

లబ్ధిదారులకు అందాల్సిన పథకాలివీ..
(ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు)

పథకం	లబ్ధిదారులు	అందాల్సిన మొత్తం(రూ.కోట్లలో)
అన్నదాత సుఖీభవ	1,80,654	361.30 (రబీ, ఖరీఫ్)
తల్లికి వందనం	5,40,990	811.85
నిరుద్యోగ భృతి	1,27,672	229.80
మహిళలకు నెలకు (1500)	10,25,965	923.36
ఉచిత గ్యాస్	6,00,307	48.86
మహిళకు ఉచిత ప్రయాణం	10,25,965	ఊసేలేదు
మెగా డీఎస్సీ (తొలిసంతకం)	45,786	ఊసేలేదు

గత ప్రభుత్వం 2023 జూన్ నుంచి డిసెంబర్ అందిన పథకాలు

పథకం పేరు	లబ్ధిదారులు	అందించిన మొత్తం(రూ.కోట్లలో)
రైతుభరోసా	1,80,654	243.88(రబీ, ఖరీఫ్)
అమ్మఒడి	2,20,880	331.32
వసతిదీవెన	66,658	40.02
వైఎస్సార్ ఆసరా	3,19,049(గ్రూపులకు)	102.11
వైఎస్సార్ కాపునేస్తం	67,572	608.14
జగనన్న చేదోడు	43,756	75.29
వైఎస్సార్ చేయూత	1,32,466	432.75



- 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 అందజేస్తామన్నారు. జిల్లాలో అర్హులైన 10,25,965 మంది మహిళలు గత ఆరు నెలలుగా ఆ సహాయం కోసం ఎదురు చూశారు. దీంతో ఆరు నెలల పాటు జిల్లాలోని అర్హులైన మహిళలు రూ.923.36 కోట్లు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



- అన్నదాత సుఖీభవ అని హామీ ఇచ్చారు. చివరకు అన్నదాతలనే మోసం చేశారు. ఆ పథకం అమలు చేయకపోవడంతో జిల్లాలోని 1,80,654 మంది రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం అందకపోవడంతో రూ.361.30 కోట్లను రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3000 నిరుద్యోగ భృతి



- అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు దాని జోలికే వెళ్లలేదు. దీంతో జిల్లాలో ఉన్నత చదువులు చదివిన 1,27,672 మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. వీరందరూ ఆరు నెలల పాటు రూ.229.80 కోట్లను నష్టపోయారు.
- సీఎం ప్రమాణ స్వీకారంలో తొలిసంతకం చేసిన మెగా డీఎస్సీ అమలునే తుంగలో తొక్కారు. దీంతో జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న లక్షలాది మంది అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు.



- తల్లికి వందనం పథకం అమలు చేస్తారని జిల్లాలోని 5,40,990 మంది తల్లులు ఎదురుచూశారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నప్పటికీ ఇంత వరకు ఆ పథకం ఊసే లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ.811.85 కోట్లను తల్లులు నష్టపోయారు.

ఎదురు చూస్తున్నాను



కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. బతకడానికి ఎలాంటి ఆధారం లేదు. నా భర్త మునిరత్నం చనిపోయి 6 నెలలు కావస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వ కార్యాలయాలకు ఎన్ని సార్లు వెళ్లి పింఛన్ మంజూరు కోసం అభ్యర్థించాను. అయినా ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. పింఛన్ మంజూరు చేస్తే జీవనానికి కాస్త ఆసరా దొరుకుతుంది. ప్రస్తుతం నాకు 61 సంవత్సరాలు నిండాయి. ప్రభుత్వం పింఛన్ మంజూరుపై దృష్టి సారించి, వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరుకుంటున్నాను. – టి.నాగమ్మ, కొత్త ఒడ్డిపల్లి గ్రామం, మద్దినాయనపల్లి పంచాయతీ, పాకాల మండలం

ప్రతి మహిళకు గ్యాస్ తుస్సే...



సూళ్లూరుపేట మున్సిపాలిటీలో 15 ఏళ్లుగా కాపురం ఉంటున్నాం. మాది చాలా నిరుపేద కుటుంబం. నా భర్త ఆపాచీ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలున్నారు. గత ప్రభుత్వంలో లాగా కూటమి సర్కారులో కూడా సంక్షేమ పథకాలు అందుతాయని ఎదురు చూస్తున్నాం. ముఖ్యంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు పథకం వర్తిస్తే చాలా వరకు ఇంట్లో ఖర్చులు కూడా తగ్గిపోతాయని భావించాం. అయితే ఉచిత గ్యాస్.. తుస్సు అయ్యింది. దీపం పథకంలో ఉన్న వారికే సిలిండర్లని చెప్పారు. నిరుపేదలైన దీపం పథకంలో లేకుంటే రాదంటే ఎలా?. –బండి ఉషారాణి, మన్నారుపోలూరు

నాకు పింఛన్‌కు అర్హత ఉంది



నాకు పింఛన్ తీసుకోవడానికి అర్హత ఉంది.అయినా నాకు మంజూరు చేయలేదు. నా వయస్సు 65 ఏళ్లు. ఆరు నెలలుగా అధికారుల చుట్టు తిరుగుతున్నాను. అయినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో ఇక తిరగలేక చాలు అని భావించాను. ఇకనైనా నాకు న్యాయం చేయాలని కోరుతున్నాను. –మహేశ్వర్, చిన్నగొట్టిగల్లు మండలం, దేవరకొండ గ్రామం

మాట మరిచిన సర్కారు

సార్వత్రిక ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చి, ప్రజలను నమ్మించి, గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడేమో హామీల మాట మరిచింది. ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వ అరాచక పాలనతో రైతులు, విద్యార్థులు, సామాన్యులు అవస్థలు పడుతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఘనతను కూటమి సర్కారు దక్కించుకుంది. జిల్లాలోని అన్ని మండలాల్లో గత ఆరు నెలల పాటు సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడంతో రూ.1,835.51 కోట్ల ప్రభుత్వ లబ్ధిని పేద ప్రజలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటాలకు వైఎస్సార్ సీపీ సిద్ధం అయ్యింది. పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు కూటమి ప్రభుత్వంపై మూడు దశల్లో ఆందోళనకు జిల్లా నాయకులు సిద్ధమయ్యారు. మొదటగా రైతుల సమస్యలపై అన్నదాతకు అండగా కార్యక్రమంలో ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్‌ల వద్ద నిరసన చేపట్టనున్నారు.

హామీలు నెరవేర్చాలి



సార్వత్రిక ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. తల్లికి వందనం పథకం ద్వారా ఏటా రూ.15వేలు ఇస్తామని చెప్పారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున ఇస్తామని తెలిపారు. అయితే కూటమి సర్కార్ ఏర్పడి ఆరు నెలలు పూర్తి అయింది. ఇప్పటివరకు ఆ పథకాన్ని అమల్లోకి తీసుకురాకుండా ఉండడం న్యాయమా? విద్యాసంవత్సరం ముగుస్తున్నా ఆ పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరం. –లక్ష్మీ, వెంకటగిరి

తొలి సంతకం ఏమైనట్టో..!



గత జూన్ 12వ తేదీన రాష్ట్రముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన తొలిరోజే డీఎస్సీ నిర్వహణ ఫైలుపై సంతకం చేశారు. ఇది జరిగి ఆరు నెలలు అయ్యింది. ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. డీఎస్సీ పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇక నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో.. పరీక్ష ఎప్పుడు ఉంటుందో.. ఫలితాలు ఎప్పుడు వస్తాయో...పోస్టింగ్ ఎప్పుడో తెలియలేదు. ఈ ఐదేళ్లు ఇంతేనా?. –జోగి సులక్షణ, తిమ్మనగారి పాలెం, చిల్లకూరు మండలం

పింఛన్లు తొలగించకండి



అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి. ఎంతో మంది వృద్ధులు కేవలం పింఛన్ల ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. ఏదో ఒక వంక చూపి, పింఛన్లు మాత్రం తొలగించకండి. ఇప్పటికే పలువురు పింఛన్లు తొలగిస్తారనే ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొత్త పింఛన్లు ఇవ్వలేదని వాటి కోసం పలువురు ఎదురుచూస్తున్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి వితంతువులుగా ఉన్నవారు మాత్రమే అర్హులనడం సరికాదు. అంతకు ముందు వితంతువుల పరిస్థితి ఏమిటి చెప్పాలి. –సరోజమ్మ, జీవకోన, తిరుపతి

ఉచిత బస్సు ఎప్పుటికో?



కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అయితే అధికారం వచ్చి ఆరు నెలలు గడిచింది. అయినా ఇప్పటివరకు ఉచిత బస్సు ఊసేలేదు. కనీసం ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందో చెప్పడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఉచిత బస్సు పథకాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమలు చేశారు. రాష్ట్రంలో అమలుకు ఇబ్బంది ఎందుకో చెప్పాలని కోరుతున్నాం. – లక్ష్మమ్మ, చిన్నపాండూరు గ్రామం, వరదయ్యపాళెం మండలం

అరణియార్ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



అరణియార్ ప్రాజెక్టు నుంచి బయటకు వస్తున్న నీరు



నిండిన మల్లిమడుగు రిజర్వాయర్

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు నిండిపోవడంతో అధికారులు గురువారం ప్రాజెక్టుకు ఉన్న రెండు గేట్లను ఎత్తి, నీటిని బయటకు విడుదల చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడి అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పిచ్చాటూరు మండలంలో 40.01 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ఈ క్రమంలో గురువారం 11 గంటలకు ఇరిగేషన్ డీఈ రామచంద్ర ఆధ్వర్యంలో రెండు స్పిల్‌వే గేట్లను తెరిచి నీటిని బయటకు విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అరణియార్ ప్రాజెక్టులో 281 అడుగుల మేరకు 1.85 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 280.5 అడుగుల నీరు చేరిందన్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 6 వేల క్యూసెక్కు నీరు వచ్చి చేరుతుందన్నారు. దీంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. అరణియార్ పరివాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి, ఈఈ మదన్‌గోపాల్, తహసీల్దార్ రమేష్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మల్లిమడుగు గేట్లు..

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న మల్లిమడుగు రిజర్వాయర్ నిండడంతో అధికారులు 11 గేట్లు ఎత్తి వేసి రిజర్వాయర్‌లోని నీటిని బయటకు విడుదల చేశారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు ఇప్పటికే రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండింది. మళ్లీ బుధవారం రాత్రి నుంచి జోరువాన కురవడంతో రిజర్వాయర్ పైభాగంలో ఉన్న శేషాచలం అడవుల నుంచి భారీగా వరద నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోంది. దీంతో రిజర్వాయర్‌కు ఉన్న 11 గేట్లు ఎత్తి వేసి నీటిని బయటకు విడుదల చేశారు. మల్లిమడుగు రిజర్వాయర్ నీటి ప్రవాహాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో వచ్చి సెల్ఫీలు తీసుకుంటూ ఆస్వాదిస్తున్నారు.

రుయాకు పరికరాల వితరణ

తిరుపతి తుడా: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ రుయాస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రూ.10 లక్షల విలువగల పరికరాలను గురువారం ఆస్పత్రి అధికారులకు అందజేశారు. ఇందులో ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, చిన్నపిల్లల విభాగాలకు సంబంధించిన నాలుగు రకాల పరికరాలున్నాయి. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్, రుయాస్పత్రి అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

–మరో 16 మందికి గాయాలు



మృతి చెందిన పంచవర్ణం



గాయపడిన మహిళ

చంద్రగిరి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, 16 మంది గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా మల్లంపట్టి గ్రామానికి చెందిన ఏడుగురు కుటుంబ సభ్యులు చిన్న పసికందుతో కలసి బుధవారం రాత్రి తిరుమల శ్రీవారి దర్శనార్థం కారులో బయలుదేరారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున వెనుక వస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పంచవర్ణం(54) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు.

రెండు కార్లు ఢీకొని.. :

ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటన గురువారం తొండవాడ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన భక్తులు కాణిపాకం వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుని, కారులో తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. తొండవాడ బ్రిడ్జ్ వద్ద తిరుపతికి చెందిన యువకులు చంద్రగిరికి వస్తున్న క్రమంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న విజయవాడ భక్తుల కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లలోని 10 మందికి తీవ్ర గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి వెస్ట్ చర్చి వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలో నిలిచిన నీరు





అత్తూరు వద్ద కాజ్‌వే పై ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

జల దిగ్బంధం

- శ్రీకాళహస్తిలో ఒకరి మృతి
- 11 మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు బంద్
- చెన్నై మార్గంలో 40 శాతం సర్వీసులు తగ్గింపు
- జిల్లాలో నగటు వర్షపాతం 81.9 మిల్లీమీటర్లు
- అత్యధికంగా బీఎన్ కండ్రిగలో 166.8 మిల్లీమీటర్లు
- అత్యల్పంగా చిల్లకూరులో 26.4 మిల్లీమీటర్లు

తిరుపతి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జిల్లా జలమయమైంది. తిరుపతి నగరంలోని లక్ష్మీపురం సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్ ప్రాంతం, అన్నరావు సర్కిల్, లీలామహల్ సర్కిల్, ఆటోనగర్ ప్రాంతాల్లో జలమయమయ్యాయి. కాగా జిల్లాలోని 599 ఇరిగేషన్ చెరువుల్లో 500కు పైగా నిండుకుండలా మారాయి. మిగిలిన 99 చెరువులు గురువారం రాత్రికి నిండుతాయని అంతా భావిస్తున్నారు. 22 గ్రామాల్లో కాజ్‌వేలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో రాకపోకలు ఆగిపోయాయి. వర్షం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే 11 మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు గురువారం పూర్తిగా రద్దు చేశారు. చెన్నై మార్గంలో 40 శాతం సర్వీసులను తగ్గించారు.

శ్రీకాళహస్తిలో ఒకరి మృతి

శ్రీకాళహస్తి మండలంలోని అబ్బాబట్లపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు చెరువులో ఎంత నీరు వచ్చిందో చూడడానికి వెళ్లి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 350 హెక్టార్లలో వరి పైరు నీట మునిగింది. జిల్లాలోని అరణియార్, మల్లిమడుగు రిజర్వాయర్ల గేట్లు ఎత్తి వేశారు.



తిరుపతిలో ఓ ఇంట్లో చేరిన వరద నీరు

జిల్లాలో 81.9 మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో గురువారం సాయంత్రం 6 గంటల వరకు 81.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా బీఎన్ కండ్రిగ మండలంలో 166.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చిల్లకూరు మండలంలో 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. డక్కిలిలో 136.4 మి.మీ, కేవీబీపురంలో 132.4 మి.మీ, సూళ్లూరుపేట 131.4మి.మీ, వరదయ్యపాళెం 120.4 మి.మీ, బాలాయపల్లి 119.6 మి.మీ, వడమాలపేట 116.4 మి.మీ, తడ 107.6 మి.మీ, దొరవారిసత్రం 96 మి.మీ, పుత్తూరు 95.2 మి.మీ, పెళ్లకూరు 94.8 మి.మీ, రేణిగుంట 93.2 మి.మీ, వెంకటగిరి 91.8 మి.మీ, శ్రీకాళహస్తి 91 మి.మీ, తొట్టంబేడు 89.8 మి.మీ, ఏర్పేడు 88.4మి.మీ, సత్యవేడు 86.8 మి.మీ, ఆర్సీపురం 76.4 మి.మీ, నాయుడుపేట70.4 మి.మీ, తిరుపతి రూరల్ 65.8 మి.మీ, తిరుపతి అర్బన్ 65.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



కాళంగి నదిని పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్మయి యాదవ్



ఉధృతంగా ప్రవహిస్తున్న పాముల కాలువ



సైదాపురం బస్టాండ్‌లో నిలిచిన నీరు



రామచంద్రాపురం: చీకటికోన వాగు ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందిన ఆవు

ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే పోటీలు

- నాలుగు బృందాలకు నగదు పురస్కారాలు

రేణిగుంట: ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజులుగా జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్– 2024 (సాఫ్ట్‌వేర్ ఎడిషన్) గ్రాండ్ ఫినాలే పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో దేశంలోని వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన 21 జట్లు ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించిన సవాళ్లకు విభిన్న పరిష్కారాలను కనుగొన్నారు.

విజేతలకు నగదు బహుమతులు

ఈ పోటీల్లో పాల్గొన్న 126 మంది సభ్యులతో కూడిన 21 జట్లు అందించిన పరిష్కారాల నుంచి అత్యుత్తమమైన ప్రతిభ కనబరచిన జట్లను ఎంపిక చేశారు. విజేత జట్ల బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలు వీరే.. :

- తమిళనాడు కోయంబత్తూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు సీబీ సుశ్మిత టీమ్ లీడర్‌గా ఉన్న జట్టు
- ఆర్ఎంకే ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆర్.శ్వేత టీమ్ లీడర్‌గా ఉన్న జట్టు
- పంజాబ్ యూనివర్సిటీ యూఐఈటీ విద్యార్థులు కార్తిక్ టీమ్ లీడర్‌గా వ్యవహరించిన జట్టు
- మహారాష్ట్రకు చెందిన కేకేడబ్ల్యూ ఏజీహెచ్ విద్యార్థులు పర్ణిక పాటిల్ టీమ్ లీడర్‌గా ఏర్పడిన జట్టు, పూనెకు చెందిన ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు కౌషల్ వ్యాస్ టీమ్ లీడర్‌గా ఏర్పడిన జట్టు సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిచాయి. వీరికి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ, ముఖ్యఅతిథి తిరుపతి స్విమ్స్ వీసీ ప్రొఫెసర్ ఆర్‌వీ కుమార్, ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ కుమార్ గుంజు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఒక్కొక్క జట్టుకు రూ.లక్ష చొప్పున మొత్తం నాలుగు జట్లకు రూ.4 లక్షలు ప్రైజ్ మనీగా అందించారు.



విజేతలకు బహుమతులు అందుకున్న విజేతలతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

కుంగిన పాదిరేడు పెద్దచెరువు కట్ట

వడమాలపేట (విజయపురం) : వడమాలపేటలోని పాదిరేడు పెద్ద చెరువు కట్ట స్వల్పంగా కుంగింది. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్‌ప్రసాద్, డీఈ శ్రీనివాసులు, తహసీల్దార్ జరీనా గురువారం చెరువు కట్టను పరిశీలించారు. కుంగిన కట్ట వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. కలుజును మరింత లోతుగా తవ్వి నీటిని దిగువకు వదిలిపెట్టారు. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షానికి చెరువు కట్ట స్వల్పంగా కుంగిందని అధికారులు తెలిపారు.



వర్షానికి కుంగిపోయిన పాదిరేడు చెరువు కట్ట

రైతు సంక్షేమమే లక్ష్యంగా నూతన పరిశోధనలు

తిరుపతి సిటీ : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా యువత నూతన పరిశోధనలకు నాంది పలకాలని వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ జీవీ రమణ పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో రెండు రోజులుగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసి జాతీయ పరిశోధన సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ప్రథమంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సు జరగడం అభినందనీయమన్నారు. పశువులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు, వాటి నివారణ, నిర్ధారణ ప్రక్రియలపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరగాలన్నారు. యువత గ్రామీణ పాడి రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు సాగాలన్నారు. దేశ వ్యాప్తంగా సదస్సుకు హాజరై ఉత్తమ పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య, డీన్ వీరబ్రహ్మయ్య, సదస్సు కో ఆర్గనైజింగ్ సెక్రటరీలు సుధీర్, మురళి, చైతన్యకుమార్ పాల్గొన్నారు.



ఉత్తమ పరిశోధన పత్రాలను సమర్పించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వీసీ

దాడి కేసులో కానిస్టేబుల్‌పై కేసు నమోదు

చిట్టమూరు (చిల్లకూరు) : మండలంలోని కొత్తగుంట ప్రాంతంలో ఒక ప్రైవేటు కంపెనీ కార్యాలయంలో పనిచేసే శివపై నాయుడుపేటలో పనిచేస్తున్న పోలీసు కానిస్టేబుల్ చంద్ర దాడి చేశాడు. బాధితుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చినబలరామయ్య తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కానిస్టేబుల్ చంద్ర గతంలో చిట్టమూరులో పనిచేస్తూ పోలీసు క్వార్టర్స్‌లో నివాసం ఉండేవాడని తెలిపారు. ఆ సమయంలో శివతో చిన్న వివాదం నెలకొందన్నారు. ఈ క్రమంలో మంగళవారం చంద్ర విధులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లే సమయంలో కొత్తగుంటలోని ప్రైవేటు కంపెనీ వద్ద ఉన్న శివతో వాగ్వాదానికి దిగి దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీకి నివేదిక అందజేసినట్లు పేర్కొన్నారు.

వాన నీటిలో స్కూలు ప్రయాణం

గాలివానలో.. వాన నీటిలో స్కూలు ప్రయాణం.. అయినా గమ్యమేమిటో తెలియదు పాపం.. అన్నట్టుంది.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిస్థితి. వాతావరణశాఖ ముందే హెచ్చరించినా.. విద్యాశాఖాధికారులు.. జిల్లా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం కారణంగా జలమయమైన రోడ్లు, వాగులు, వంకలు దాటి స్కూళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. అది చాలదన్నట్లు ఆలస్యంగా సెలవు ప్రకటనతో తిరిగి ఇళ్లకు చేరడానికి పెద్ద యజ్ఞమే చేయాల్సి వస్తోంది. ఫలితంగా చిన్నారుల భద్రత గాలిలో దీపమైంది.

- అధికారుల నిర్లక్ష్యం
- విద్యార్థులకు భద్రత కరువు

తిరుపతి అర్బన్: చిన్నారుల జీవితాలతో విద్యాశాఖతోపాటు జిల్లా ఉన్నతాధికారులు చెలగాటం ఆడుతున్నారు. అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా..విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రత విషయంలో విద్యాశాఖాధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చిన్నారుల భద్రత గాలిలో దీపంలా మారింది.



తిరుపతిలోని లక్ష్మీపురం సర్కిల్‌లో విద్యార్థుల పాట్లు

భద్రత ప్రశ్నార్థకం

వరదనీటిలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ఇక్కట్లు పడుతున్నారు. తీరా ఏదో ఒక బాధపడి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో వదిలి వచ్చిన తరువాత సెలవు ప్రకటిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూళకు వెళ్లి చిన్నారులను తీసుకురావడానికి ఇక్కట్లు పడడమే కాకుండా ఒక్కొక్కసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. గురువారం కూడా ఇదే జరిగింది. ఉదయం నుంచి జోరు వాన కారణంగా రోడ్లన్నీ జలమయమైనా అధికారులు విద్యాసంస్థల సెలవు ప్రకటన విషయంలో మీనమేషాలు లెక్కించారు. తీరా ఉదయం పది గంటల ప్రాంతంలో సెలవు ప్రకటించారు. దీంతో జలమయమైన రోడ్లలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇక్కట్లు పడ్డారు. వర్షాకాలంలో గత మూడు నెలలుగా ఇదే తంతు జరుగుతోంది. అయినా అడిగేనాథుడు కానీ.. పట్టించుకునే వారెవరూ లేరనడంలో అతిశయోక్తి కాదు.

మధ్యాహ్న భోజన తయారీ ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేస్తారనే ఉద్దేశంతో వంట చేయకుండా పనులకు వెళుతుంటారు. అయితే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిన తరువాత అటు, ఇటు కాకుండా 9.30 నుంచి పది గంటల ప్రాంతంలో సెలవులు ప్రకటించడంతో పాఠశాలలో భోజనం పెట్టకపోవడంతో ఇళ్లకు వచ్చి పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

జిల్లా కేంద్రం నుంచి 40 శాతం మంది టీచర్లు..

జిల్లా కేంద్రమైన తిరుపతిలోనే సుమారు 40 శాతం మంది ఉపాధ్యాయులు జిల్లా కేంద్రం నుంచే విధులకు వెళ్లి వస్తున్నారు. వీరిలో కొందరు సుమారు 70 నుంచి 100 కిలోమీటర్లు ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణం చేయడానికి తెల్లవారుజామున 5 గంటల నుంచే సిద్ధం అవుతుంటారు. తీర పాఠశాలకు వెళ్లిన తర్వాత ఈ రోజు వర్షం కారణంగా సెలవు అంటూ ప్రకటిస్తున్నారు. దీంతో తిరిగి ఇళ్లకు చేరడానికి వారు ఇక్కట్లు పడుతున్నారు.

పిల్లలకు సమాచారం ఇవ్వాలి



పిల్లలకు పాఠశాలకు సెలవు ఇస్తున్నారా? లేదా అని ముందుగానే చెప్పాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉంది. అలాకాకుండా పాఠశాలకు వెళ్లిన తర్వాత సెలవు ఇస్తే...ఎన్నో సమస్యలు వస్తున్నాయి. పాఠశాలలో పిల్లలను వదిలిన తరువాత సెలవు అంటే పనులు మానుకుని మళ్లీ వెళ్లాల్సి వస్తోంది. దీనికితోడు వరద ప్రభావం అధికంగా ఉండడంతో చాలా ఇబ్బందులతోపాటు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. **-రుక్మిణమ్మ, విద్యార్థిని తల్లి, తిరుపతి**

వర్షాకాలం ముందు జాగ్రత్త ముఖ్యం



వర్షాల సమయంలో ముందు జాగ్రత చాలా ముఖ్యం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ముందే ప్రకటించాలి. లేదంటే విద్యార్థులకు అనేక ఇబ్బందులు నెలకొంటున్నాయి. వారి తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. వాతావరణశాఖ ముందే హెచ్చరిస్తున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. **-రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి**

ఏ జిల్లాలో ఇలా లేదు



ఏ జిల్లాలో ఇలా వర్షం వచ్చిన తర్వాత సెలవు ఇవ్వడం లేదు. ముందుగా ఇస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు. తిరుపతి జిల్లాలో మాత్రమే విచిత్రంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలకు పిల్లలు వెళ్లిన తర్వాత వర్షం ఎక్కువగా ఉంటే సెలవు ఇస్తున్నారు. ఇలా చేయడం విడ్డూరంగా ఉంది. **-ప్రవీణ్‌కుమార్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

ఇకపై ముందే ప్రకటిస్తాం



జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మరోసారి ఇలాంటి పరిస్థితులు రాకుండా ముందు రోజే సెలవు ప్రకటిస్తాం. సెలవు ఇచ్చిన తర్వాత వర్షం లేకుంటే ఒక రోజు వృథా అవుతుందనే ఉద్దేశంతో అలా చేశాం. గురువారం సెలవు ప్రకటించిన సమయం ఆలస్యమైంది. ఇలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. **-కేవీఎన్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి**